## పరిచయం

# కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక క్రైస్తవ సాహిత్యమునకు సంబంధించిన మహత్కార్యములలో ఒకటై యున్నది. ప్రతి యుగములో జీవించు క్రైస్తవులకు ప్రయోజనకరముగా నుండు ఆదేశములు అందులో కలవు. ఈ ఆదేశములు బైబిలులోని ప్రధాన చర్చనీయాంశములకు సంబంధించినవై యున్నవి. ఈ చర్చనీయాంశములలో అత్యున్నతమైనదిగా ఘనపరచబడు యేసు, దేవుని స్వరూపమై యున్న యేసు స్వభావము బహుశా అత్యంత ప్రాముఖ్యమైనదై యుండును. స్వభావమునుబట్టి ఆయన దేవుడై యున్నాడు సంపూర్ణ దైవత్వము కలిగియున్నాడు, సంఘమునకు శిరస్సై యున్నాడు, మరియు సమస్తమునకు సృష్టికర్తయై యున్నాడు. మన పరలోక నిరీక్షణకును, మన ప్రార్థనలకు ప్రత్యుత్తరములు వచ్చునను నమ్మకమునకును యేసే మూలాధారమై యున్నాడు. ఆయన పాపక్షమాపణను జీవితమునకు నూతనత్వమును, మరియు జీవిత గమన నిర్దేశమనమును, నైతికతను, మరియు ఆధ్యాత్మికతను సమకూర్చుతాడు.

ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధముల నిమిత్తము దేవుడు రూపొందించిన నియమమును పౌలు నివేదించాడు. క్రీస్తుకు బదులుగా మానవీయ తత్వమును మరియు సాంప్రదాయములను అనుసరించుటకు విరోధముగా కూడ ఆయన హెచ్చరించాడు. క్రైస్తవులు వారి జీవితములో అనుకరింపదగు ఒక సూక్తిని ఆయన ఇదే పత్రిక కొలస్సయులకు 3:23, 24లో ఇచ్చాడు: “ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను, అది మనుష్యుల నిమిత్తము కాక, ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి. మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులై యున్నారు.”

ఈ పత్రిక వ్యక్తిగతమైనది అనగా, ఈ పత్రిక రచన యొక్క నేపథ్యంలో అనేక మంది వ్యక్తులుండిరి. ఇతర ఆరుగురితో – అరిస్తార్కు, మార్కు. యూస్తు, ఎపఫ్రా, లూకా, మరియు దేమాతో పాటు (4:10–14) – రచయితతో తిమోతి కూడ ఉండినాడు (1:1, 2), వీరందరును కొలొస్సయిలో నున్న సహోదరులకు శుభవందనములు పంపించారు. ఇంకా, ఈ పత్రికను చేరవేయవలసి యుండిన తుకికు, మరియు అతనితో కూడ వెళ్లవలసి యుండిన కొలొస్సయిలోని బానిస ఒనేసిము కూడ పేర్కొనబడి యున్నారు (4:7–9). కొలొస్సయిలో నివసించుచుండెనని భావింపబడుచుండిన అర్ఖిప్పు నిమిత్తము వ్యక్తిగతమైన ఒక సందేశము సహితము చేర్చబడి యుండినది (4:17), ఈయన పేరు, ఒనేసిము యొక్క యజమానియైన ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికలో కూడ పేర్కొనబడినది (ఫిలేమోను 1, 2).

### గ్రంథకర్త

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక రచయిత పౌలే యని అంతర్గతమైన మరియు బాహ్యమైన ఋజువులు సూచించుచున్నవి. 1800 సం॥ల వరకు కూడ, పౌలు యొక్క గ్రంథకర్తృత్వము గూర్చి ఎవరును ఎదురు ప్రశ్న వేయలేదు. ఈయన గ్రంథకర్తృత్వమునకు

సంబంధించి వ్రాయబడిన తొలి అభ్యంతరము 1838లో ఎర్నెస్ట్ థియోడోర్ మేయర్‌హోఫ్ చేత ప్రచురింపబడిన, *Der Brief an die Kolosser* పత్రికలో అగుపించినది.[1] ఆనాటి నుండి ఈయన రచించిన ముగింపులను కొందరు ఇతర రచయితలు అంగీకరించారు, కానీ పండితులలో అత్యధికులు ఈ పత్రిక రచయిత పౌలే అని చెప్పుచుందురు. అయితే ఈ పత్రిక రచయిత పౌలు కాదనుటకు తెలియజేయబడు అభ్యంతరములు పత్రికలోని సాహితీ శైలి, పదసంపద మరియు సిద్ధాంతపరమైన కొన్ని ఘోషణలపై ఆధారపడి యున్నవి. సర్వోచ్ఛమైన దైవమును గూర్చిన మార్మిక తెలివి మానవుని ఆత్మకు రక్షణ నిచ్చునను బోధలు, రెండవ శతాబ్దము నాటి వితండ వాదములు తప్పు అని నిరూపించుటకు ఈ పత్రిక వ్రాయబడినది, గనుక పౌలు వ్రాసియుండుననుటకు అప్పటికే అది చాలా ఆలస్యమైనదను వాదనలలో ఒక ముఖ్యమైన తర్కమై యున్నది. (ఈ పాఠములోనే అటుతరువాత గల "ఆరంభ స్థలము మరియు తేదీ" పై వ్రాయబడిన చర్చను చూడుము.) ఈ పత్రిక రచయిత పౌలే యని సూచించుచున్న నిదర్శనము గొప్పదైనందునుబట్టి ఇటువంటి అభ్యంతరములేవైనను వాటిని ఎదుర్కొని గెలువవచ్చును.

**బాహ్య ఋజువు**

ఈ పత్రిక రచయిత పౌలే యని బాహ్య ఋజువు చాలా గట్టిగా నొక్కిచెప్పుటయేగాక, ఈ పత్రిక ప్రేరేపింపబడిన లేఖనమని అంతకు పూర్వము అంగీకరింపబడినదని కూడ బయలుపర్చుచున్నది. ఈ ఋజువును Henry Clarence Thiessen[2] సంక్షిప్తంగా ఇలా చెప్పుచున్నాడు:

- తాను రచించిన *Epistle to the Ephesians*లో (అధ్యాయం. 10). బహుశా ఇగ్నేషియస్ (క్రీ.శ. 110) కొలొస్సయులకు 1:23ను ప్రస్తావించియుండవచ్చును.
- ఇంచుమించు క్రీ.శ. 130లో, వ్రాయబడిన *Epistle of Barnabas* (అధ్యాయం. 12), కొలొస్సయులకు 1:16ను ప్రస్తావించుచున్నట్లు అగుపించుచున్నది.
- కొలొస్సయులకు 1:15లో నున్న, "సర్వసృష్టికి ఆదిసంభూతుడు," అను అభివ్యక్తమును జస్టిన్ మార్టియర్ (క్రీ.శ.150) ఆయన రచించిన *Dialogue with Trypho*లో (అధ్యాయం. 84; 85; 138) అనేక పర్యాయములు ఉపయోగించాడు.
- "సర్వసృష్టికి ఆదిసంభూతుడు" అను ఇదే అభివ్యక్తమును అంతియొకయకు చెందిన థియోఫిలస్ (క్రీ.శ. 180) తాను రచించిన *To Autolycus*లో (2.22) ఒక సారి ఉపయోగించాడు.
- కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో, పౌలు, "లూకా అను ప్రియుడైన వైద్యుడు మీకు వందనములు చెప్పుచున్నాడని" వ్రాసాడని ఆయన రచించిన *Against Heresies*లో (3.14.1). ఐరేనియస్ (క్రీ.శ. 180) పేర్కొన్నాడు. ఈ ప్రకటన కొలొస్సయులకు 4:14లో ఉన్నది.
- అలెగ్జాంగ్రియాకు చెందిన క్లెమెంతు, యించుమించు క్రీ.శ. 150–215లో జీవించినవాడు, ఆయన రచించిన *Stromata* 1.1లో కొలొస్సయులకు 1:28ని పౌలు చేసిన ప్రకటన వలె ఉల్లేఖనముగా పేర్కొన్నాడు. ఈయన కొలొస్సయులకు

3:12, 14, 15 వచనములను *Stromata* 4.7లోను, కొలొస్సయులకు 4:2-4 వచనములను *Stromata* 5.10లోను ప్రస్తావించాడు.

- ఆయన రచించిన *Prescription Against Hereticsలో* (అధ్యాయం. 7) కొలొస్సయులకు 2:8ని మరియు *Resurrection of the fleshలో* (అధ్యాయం. 23). కొలొస్సయులకు 2:12, 13ను టెర్టుల్లియన్ (క్రీ.శ. 200) ఉల్లేఖించి చెప్పాడు.
- కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక గూర్చి ఎత్తి చెప్పుచు, *Against Celsusలో* (అధ్యాయం. 5.8) పౌలుకు పరపతి కలుగజేస్తూ, ఓరిగెన్ (క్రీ.శ. 225) కొలొస్సయులకు 2:18, 19 వచనములలోని మాటలను ఉల్లేఖనముగా ప్రస్తావించాడు.
- కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక ప్రాచీన లాటిన్ మరియు ప్రాచీన సిరియా దేశ భాషల్లో లిఖింపబడిన మార్సియోన్ యొక్క ప్రామాణిక గ్రంథములలో చేర్చబడి యుండినది. Muratorian Fragmentలో (క్రీ.శ. 170) అది పేర్కొనబడినది.

ఈ పత్రిక రెండవ శతాబ్దము నాటి ప్రాచీన లాటిన్ భాషాంతరీకరణములలోను, రెండవ శతాబ్దము ముగియుచుండిన రోజుల్లో ఐగుప్తులో ఆరంభమైన Chester Beatty codexలో కూడ (పి46 అని పిలువబడినది) కనబడును.

**అంతర్గతమైన ఋజువులు**

బాహ్య ఋజువుల వలెనే అంతర్గత ఋజువులు కూడ ఈ పత్రిక రచయిత పౌలే అని సూచించుచున్నవి.

మొదటిదిగా, గ్రంథకర్త తనను తాను పౌలుగా 1:1లో గుర్తించుకొనుచున్నాడు. ఆ తరువాత ఆయన తనను తాను "పౌలు" అని సంబోధించుకొనుచున్నాడు (1:23) అదేవిధంగా "పౌలను నేను, స్వహస్తముతో నా వందనములు వ్రాయుచున్నాను" అని చెప్పుచు ఈ పత్రికను ముగించుచున్నాడు (4:18).

రెండవదిగా, కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక, పౌలు సంబంధమైనదే అని సాధారణంగా అంగీకరింపబడు, ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికతో, అత్యంత సమీప సంబంధము కలిగియున్నది. అదే ఐదుగురు వ్యక్తులు రచయితతో ఉన్నట్లు ఈ రెండు పత్రికలు పేర్కొనుచున్నవి (కొలొస్సయులకు 4:10-14; ఫిలేమోను 23, 24). కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో, "ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్తపడుము" అని అర్ఖిప్పు మందలింపబడినాడు (4:17). ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికలో, ఈ అర్ఖిప్పునే పౌలు "మా తోడి యోధుడు" అని సంబోధించుచున్నాడు (వచనం 2).

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికను ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రికతో డొనాల్డ్ గుత్రీ పోల్చుచు చెప్పుచున్న వివరములను చూచినట్లయితే ఈ పత్రిక పౌలు రచించినదే అని గుర్తించుటకు అవి సహాయకరముగా నుండును. పత్రిక రచయిత పౌలే యని వెలుపలి మూలాధారములు సూచించుచున్నవని చెప్పిన తరువాత, ఆయన ఇలా వ్రాశాడు:

బలమైన ఈ వెలుపలి ధ్రువీకరణము ఈ పత్రిక మరియు ఫిలేమోను పత్రిక మధ్య గల దగ్గరి సంబంధము చేత మరింత బలపర్చబడుచున్నది, అత్యంత వ్యతిరేకార్థక ధృక్పథముగల విమర్శకులతో మాత్రమే దీని ప్రామాణికత్వము సవాలు చేయబడినది. ఈ సంబంధమును కొనసాగించుటలో ఈ క్రింది కారణములు ఉండవచ్చునని చెప్పుకొనవచ్చును.

1. ఈ రెండు పత్రికలలో లిఖింపబడిన ఆరంభ అభివందనములలో పౌలు పేరుతో పాటు తిమోతి పేరు కూడ పేర్కొనబడి యున్నది (కొలొస్సయులకు 1:1; ఫిలేమోను 1).

2. రెండు పత్రికలలోను అరిస్తార్కు, మార్కు, ఎపఫ్రా, లూకా మరియు దేమా వందనములు పంపించుచున్నారని పేర్కొనబడి యున్నది. వీరందరు ఆయన ఈ పత్రిక వ్రాయుచుండిన సమయంలో ఆయనతో కూడ ఉండిరని స్పష్టమగుచున్నది (కొలొస్సయులకు 4:10–14; ఫిలేమోను 23, 24).

3. ఫిలేమోను పత్రిక 2వ వచనంలో అర్ఖిప్పు "తోడి యోధుడు" అని పిలువబడుచు, కొలొస్సయులకు 4:17లో ఆయనకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు తగు జాగ్రత్త వహించవలెనని ఆదేశింపబడుచున్నాడు.

4. ఒనేసిము … తుకికుతోకూడ పంపింపబడుచున్నాడని కొలొస్సయులకు 4:8–9లో పేర్కొనబడుచు, "మీయొద్ద నుండి వచ్చినవాడే" అని వర్ణింపబడుచున్నాడు.

ఆధారపడదగు ఈ నిర్దష్టాంశాల దృష్టిలో ఈ రెండు పత్రికలు వెవ్వేరు సమయాల్లో పంపింపబడినవని ఊహించుకొనగలుగుట అసాధ్యము, మరియు ఫిలేమోను పత్రిక గూర్చిన ప్రామాణికత్వము సాధారణంగా సందేహాత్మకంగా ప్రశ్నించబడదు గనుక, కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక పౌలు చేసిన ఒక యథార్థమైన పని యను నిశ్చయత కూడ కలదు.[3]

మూడవదిగా, కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో గల ఉపదేశము, పౌలు గలతీయులకును ఎఫెసీయులకును వ్రాసిన విషయములకు భిన్నముగా నున్నదని కొందరు తర్కించుచున్నప్పటికిని, ఇటువంటి అభ్యంతరముల కంటే సమరూపకతలే చాలినంత ప్రాధాన్యతగలవై అభ్యంతరమును భారమును తగ్గించుచున్నవి.[4] ఆ పాఠం ఆకరిలో నున్న పటము మూడు పత్రికల నడుమ గల అనేక సామాన్య సమాకృతుల నమూనాను ఒక దానిని సమకూర్చును.[5]

కొలొస్సీ పత్రికలో గల అసమానమైన పదసంపద మరియు సాహితీ శైలికి సంబంధించిన ఇతర భేదముల గూర్చి చెప్పుకొంటే, కొలొస్సయికి ప్రత్యేకంగా వర్తించు సమస్యలతో పౌలు వ్యవహరించు తీరులో మాత్రమే ఈ విశేష లక్షణములు అగుపించునను గమనింపవలసి యుండును. ఉదా॥ ఎఫెసీయుల అవసరములు, కొలొస్సయుల అవసరములకు భిన్నముగా ఉండినవి. ఎఫెసీ పత్రికలో నున్న వక్కాణింపు కొలొస్సీ పత్రకలో నున్న దానికి తారతమ్యముగా నున్నదని కర్టిస్ వాహ్‌గన్ సూచించున్నాడు:

> … ఎఫెసీ పత్రికలో, సంఘము క్రీస్తు శరీరమనియు; కొలొస్సీ పత్రికలో, సంఘమునకు క్రీస్తు శిరస్సైయున్నాడనియు నొక్కి వక్కాణింపబడినది … కొలొస్సీ పత్రిక నిర్దిష్టముగాను, స్పష్టమైనదిగాను, మరియు (వాక్యములలో భావపూర్ణ కొరకు కొన్ని పదములు వదలివేయబడినను అవి) పాఠకుని చేత అటు తరువాత గ్రహింపబడు మాటతోను నిండియున్నది; ఎఫెసీ పత్రిక గూఢమైనదై భావవాచక పదములతో కూడినదిగాను, ఉపదేశాత్మకమైనదిగాను, మరియు సామాన్యమైనదై యున్నది … కొలొస్సీ పత్రిక … "చర్చలు గల పత్రిక"యై యున్నది; ఎఫెసీ పత్రిక … "పర్యాలోచనచేయు పత్రికయై యున్నది."[6]

కొన్ని తారతమ్యములున్నప్పటికిని, కొలొస్సీ పత్రికలో నున్న వ్యక్తీకరణముల తీరుల

అత్యధికంగా పౌలుకు సంబంధించినవై యున్నవి. గలతీ, ఎఫెస్సీ, కొలొస్సీ, మరియు ఫిలేమోను పత్రికలను గ్రంథస్తం చేసినది ఒకరేనని అంతర్గత నిదర్శనము యొక్క ప్రాధాన్యత సూచించుచున్నది.

## ఆరంభ స్థలము మరియు తేదీ

పౌలు చెరసాలలో ఉన్నప్పుడు ఈ కొలొస్సీ పత్రికను రచించాడు (4:2-4, 10, 18; ఎఫెసీయులకు 3:1; 4:3; 6:19, 20; ఫిలిప్పీయులకు 1:7, 13, 14, 15-17; ఫిలేమోను 1, 8-10, 13 చూడుము). ఆయన కైసరయలోను (అపొస్తలుల కార్యములు 24:27) మరియు రోమాలోను (అపొస్తలుల కార్యములు 28:30) చెరసాలలో బందీగా దీర్ఘ కాలము గడిపాడు. ఒక మిషనెరీగా, అత్యధిక దీర్ఘకాలము ఎఫెస్సులోని ఒక చోట గడిపాడు (అపొస్తలుల కార్యములు 20:17, 31). అందునుబట్టియే, కొలొస్సీ పత్రిక వ్రాయబడిన స్థలములు ఈ మూడు పట్టణములై యుండునని అవి అతి తరుచుగా పేర్కొనబడుచున్నవి.

కొలొస్సీ పట్టణమునకు ఎఫెస్సు పట్టణము సాపేక్షముగా అతి సమీపముగా ఉన్నందునుబట్టి, ఆ సంఘము గూర్చియు, ఆ సంఘము ఎదుర్కొనుచుండిన సమస్యల గూర్చియు సమాచారమును పౌలు ఎప్పటికప్పుడు సులభముగా పొందియుండవచ్చును, గనుక ఈ పత్రిక రచింపబడిన స్థలము ఎఫెస్సు పట్టణమని అభిమానముగలవారు చెప్పుచుందురు. ఇదే కారణమునుబట్టి పౌలు కైసరయ లేక రోమా పట్టణములకు బదులుగా ఎఫెస్సులో ఉండినట్లయితే, ఆయనకు సంఘమును గూర్చిన సమాచారము అందించుటకు ఎపఫ్రా ఎక్కువ దూరము ప్రయాణం చేయాల్సిన అవసరము కూడా లేదు (కొలొస్సయులకు 1:7). ఆయన బస చేయుటకు ఒక స్థలము సిద్ధము చేయవలెనని పౌలు ఫిలేమోను 22లో మనవి చేసాడు, గనుక అది పౌలుకు అతి చేరువగా ఉండియుండునను భావము నిచ్చుచున్నది.

ఏదిఏమైనా, ఆయన ఎఫెస్సు పట్టణములో పరిచర్య చేయుచుండినప్పుడు చెరసాలలో వేయబడెనని చెప్పుటకు నిశ్చయమైన నిదర్శనము లేదు, గనుక ఆ స్థలము ఎఫెస్సు పట్టణము కాదని చెప్పవచ్చును (అపొస్తలుల కార్యములు 20:31). ఆయన ఎఫెస్సులో "మృగములతో" పోరాడుచుండెనని సూచించుటనుబట్టి (1 కొరింథీయులకు 15:32) ఆయన ఆ పట్టణములో బందీగా బంధింపబడి యుండెనని ఋజువు చేయదు. మార్కు మరియు లూకా వారి వందనములు ఎఫెస్సు పట్టణము నుండి పంపించి యుండినట్లయితే (కొలొస్సయులకు 4:10, 14), అది అపొస్తలుల కార్యముల పుస్తకములోని వివరముతో క్రమపర్చబడజాలదు, ఏలయనగా పౌలు ఎఫెస్సు పట్టణములో ఉండినప్పుడు వారు ఆయనతో కూడ ఉండిరని అది పేర్కొనుట లేదు (అపొస్తలుల కార్యములు 19). పౌలు కొలొస్సీ పత్రిక వ్రాసినప్పుడు లూకా ఆయనతో కూడ ఉండెను (కొలొస్సయులకు 4:14); కానీ అపొస్తలుల కార్యములు 19లో "మేము" అని పేర్కొనబడకపోవుట, లూకా అనగా, అపొస్తలుల కార్యముల పుస్తక రచయిత, పౌలు ఎఫెస్సులో ఉన్నప్పుడు ఆయనతో కూడ లేడని సూచించుచున్నది. అయితే పౌలుతో కూడ రోమా పట్టణమునకు ప్రయాణం చేసాడు (అపొస్తలుల కార్యములు 27:1; 28:16).

ఆ సమయంలో పౌలుతో కూడ అరిస్తార్కు మరియు తుకికు ఉండుటకు ఎక్కువ అవకాశములున్నవని పౌలు కైసరయలోని చెరసాలలో ఉన్నప్పుడు కొలొస్సీ పత్రికను రచించాడని నమ్మువారు అనుకొనుచున్నారు. పౌలు యెరూషలేమునకు ప్రయాణమై

వెళ్లుచుండినప్పుడు వారు ఆయనతో కూడ ఉండిరి (అపొస్తలుల కార్యములు 20:4) గనుక ఆయన అచ్చట ఉండినప్పుడు ఆయనకు ఉపచారము చేయుటకు ఆయనను కైసరయ వరకు వెంబడించి యుందురు (అపొస్తలుల కార్యములు 24:23).

పౌలు కొలొస్సీ పత్రికను రచించిన స్థలము కైసరయ కూడ అయియుండుట కాదనలేము. కొలొస్సయులకు 1:28, 29లో ఆయన పరోక్షంగా ప్రస్తావించుచున్న ప్రబోధ పరిచర్య ఆయన కైసరయలో ఉన్నప్పుడు కొనసాగుచుండినదని అపొస్తలుల కార్యముల గ్రంథంలో పేర్కొనబడలేదు. ఆయన రోమా పట్టణంలో గృహనిర్బంధములో ఉంటూ, కనీసము రెండు సం॥లు బోధించాడు (అపొస్తలుల కార్యములు 28:16, 30, 31). ఈ పత్రిక రచింపబడిన స్థలము కైసరయ అయినట్లయితే, ఆయనతో కూడ మార్కు ఉండెనని (కొలొస్సయులకు 4:10) వివరించుటకును, అపొస్తలుల కార్యములతో పొందుపర్చుటకును కష్టముగా నున్నది. మార్కు పౌలును విడిచిపెట్టి బర్నబాతో కూడ కుప్రకు వెళ్లిపోయాడు (అపొస్తలుల కార్యములు 15:39).

పౌలు కొలొస్సీ పత్రికను గ్రంథస్తం చేయుచుండినప్పుడు ఆయన రోమా పట్టణంలో ఉండుటకు అత్యధిక అవకాశములున్నవి. ఈ దృక్పథము క్రిసొస్తము చేత క్రీ.శ. 375లోనే వ్యక్తము చేయబడినది.[7] పౌలు మరియు మార్కు ఒకరితో నొకరు సమాధానపడుటకు ఇది కొంత సమయాన్ని సమకూర్చుచున్నది. ఫిలిప్పీ పత్రికలో, ఇది కూడ చెరసాలలో ఉన్నప్పుడు రచింపబడినదే, పౌలు "ప్రేతోర్యమను సేన" గూర్చియు, "కైసరు ఇంటివారిలో ఉన్న పరిశుద్ధులందరు" అనియు పేర్కొనుచున్నాడు (ఫిలిప్పీయులకు 1:13; 4:22). పౌలు ఫిలిప్పీయులకు పత్రిక వ్రాసినప్పుడు ఆయన రోమా పట్టణంలో ఉండెనని ఈ వాక్సరణి సూచించుచున్నది.

ఈ పత్రికను వ్రాసినప్పుడు పౌలు ఎఫెస్సు పట్టణంలో ఉండినట్లయితే, ఇది రచింపబడిన తేదీ యించుమించు క్రీ.శ. 52–54 అయియుండును. ఒకవేళ ఆయన ఈ పత్రకను వ్రాయుచుండినప్పుడు కైసరయలోని చెరసాలలో ఉండినట్లయితే, రచన తేదీ సూమారు క్రీ.శ. 57–59 అయియుండును.[8] ఒక తుది అభిప్రాయము ఏర్పడినది గనుక, ఆయన ఈ పత్రికను రోమా పట్టణంలో ఖైదీగా ఉండినప్పుడు వ్రాసియుండినట్లయితే, తేదీ యించుమించు క్రీ.శ. 60–62 అయియుండును.

## ఈ పత్రిక ఎవరికి వ్రాయబడినది

ఈ పత్రిక కొలొస్సీ పట్టణములోని క్రైస్తవులకు వ్రాయబడినది. "కొలొస్సీ" పట్టణము పేరుకు గ్రీకు భాషలో రెండు విధములుగా వర్ణక్రమము చెప్పబడుచున్నది, *Kolossai* కొలొస్సయి మరియు *Kolassai* కొలస్సయి. ఈ రెండు పేర్లు కూడ ప్రాచీన చేతిరాత ప్రతులలోను శిలాశాసనములలోను కనబడును. బహుశా మొదటి వర్ణక్రమము ప్రాచీనమైనదై యుండవచ్చును, రెండవది ఈ పత్రిక వ్రాయబడుచుండినప్పుడు ఉపయోగములో ఉండవచ్చును. దీని పేరు ఆ ప్రాంతములోని రాతి నిక్షేపముల ఆకారములనుబట్టి *colossus* ఒక పెద్ద రాతి విగ్రహము నుండి, ఉత్పన్నమై యుండును. స్థానికంగా ఉండిన ఉన్ని పరిశ్రమనుబట్టి ఈ పేరు వచ్చియుండుననునది మరొక వివరణయై యున్నది: అచ్చట తయారు చేయబడుచు రంగులద్దబడిన బట్టలకు *colossinus*, అనగా "ఊదా రంగు" అను

అర్థమిచ్చు గ్రీకు పదము వాడబడినది.[9]

కొలొస్సీ పట్టణము ఫ్రుగియలో ఉండినది, ఇది పెర్గమము రాజ్యములో ఒక ప్రాంతము. దానికి సమీపములో పలుకుబడిగల రెండు పట్టణములుండినవి: పన్నెండు మైళ్లు పశ్చిమమున, లవొదికయ, మరియు పదమూడు మైళ్లు వాయువ్య దిశలో, హియెరాపొలి. పౌలు కొలొస్సీ పత్రిక రచించినప్పుడు ఈ రెండు పట్టణములలోను క్రైస్తవ జనసమూహములుండినవి (కొలొస్సయులకు 2:1; 4:13–16). ఈ రెండు పట్టణముల కంటే ముందుగానే సువార్త ప్రకటింపబడిన ఎఫెస్సు పట్టణము, దీనికి పశ్చిమమున 120 మైళ్ల దూరములో ఉండినది. రోమా పట్టణము, మొదటి శతాబ్దము నాటి ప్రయాణ మార్గముల గుండా పయనించినట్లయితే, దాదాపుగా వెయ్యి మైళ్ల దూరములో ఉండినది. ("పౌలు దినములలో రోమా ప్రపంచము" పటము చూడుము.)

కొలొస్సీ పట్టణము లైకస్ లోయలో ఉండి, నదీ దక్షిణ తీరమున ఒక దుర్గము కలిగియుండినది, ఇది మెయాండర్ నది యొక్క ఉపనది. కొలొస్సీ పట్టణము ఈ రెండు నదీ ప్రవాహములు కలిసిన ఒక ఇరుకైన లోయ యొక్క ముఖభాగములో ఉండినది. ఈ ఏటిలో కర్బనామ్ల వాయువు కలిసి యుండిన నీళ్లు అసాధారణమైన మొత్తములో లభ్యమగుచుండినది, ఇది బట్టలకు రంగులద్దుటకు ఉత్తమముగా ఉపయోగకరమైనదై యుండిన విశేషమైన పైపూతను దాని నదీ తీరములలో ఏర్పరచినది. మూడు మైళ్లు దక్షిణమున, పట్టణమునకు 8,435 అడుగుల ఎత్తులో హొనాజ్ దాగ్ (కాడ్మస్ పర్వతము) ఉండినది; ఉత్తరమున మోస్యన పర్వత శ్రేణి ఉండినది. క్రి.శ. 61లో సంభవించిన భూకంపము,[10] నీరో చక్రవర్తి పరిపాలించుచుండిన కాలములో, లవొదికయ పట్టణములో విధ్వంసము సృష్టించినది లేదా దెబ్బతీసినది మరియు కొలొస్సీ మరియు హియెరాపొలి పట్టణములపై కూడ దాని ప్రభావము చూపియుండవచ్చును. లైకస్ లోయ భూకంపములకును అగ్నిపర్వతములకును ప్రసిద్ధికెక్కినది.[11]

క్రీస్తుకు అనేక శతాబ్దములకు పూర్వము, ఫ్రుగియ సామ్రాజ్యములోని సంపన్నమైన పట్టణములలో కొలొస్సీ ఒకటై యుండి, ఎఫెస్సు పట్టణము మొదలుకొని యూఫ్రటీసు నది వరకుండిన ప్రధాన మార్గములో ముఖ్యమైన పట్టణమై యుండినది. ఇద్దరు సేనాధిపతులు – అహష్వేరోషు, క్రీ.పూ. 481., మరియు అటుతరువాత కోరెషు జూ॥, క్రీ.పూ. 401– ఈ పట్టణమును సందర్శించారంటే, అది ఎంత ప్రాముఖ్యమైనదై యుండెనో తెలియుచున్నది.

హెరోడోటస్ నివేదించినట్లుగా, పారసీక చక్రవర్తియై అహష్వేరోషు (క్రీ.పూ. 485–465, ఎస్తేరు 1:1) గ్రీసు దేశముపై దండెత్తి పారసీక దేశము నుండి వెళ్లుచుండినప్పుడు కొలొస్సీ పట్టణము మీదుగా వెళ్లాడు. అటుతరువాత క్సెనోఫోన్ (క్రీ.పూ. 401), కోరెషు జూ॥ క్రింద నుండిన తెలివితేటలుగల యౌవన గ్రీకు సేనాధిపతి, అదృష్టం వక్రించిన యుద్ధయాత్రను నమోదు చేసాడు, ఆ సమయంలో కోరెషు తన సైన్యమును సార్దిస్ నుండి నైరుతి దిశగా కదల్చుతూ ఎఫెస్సులో ఏడు రోజులుండినాడు. కొలొస్సీ "జనసమ్మర్దమైనదియు, సౌభాగ్యవంతమైనదియునైన ఒక గొప్ప పట్టణమై యున్నదని" క్సెనోఫోన్ ప్రస్తావించాడు.[12] కొలొస్సీని హెరోడొటస్ "ఫ్రుగియలోని ఒక గొప్ప పట్టణము" అని పిలిచాడు.[13]

కొలొస్సీ పట్టణంలో తొలిరోజుల్లో నివసించుచుండినవారు ఫ్రుగియకు చెందిన దేశవాళీ జనులను, గ్రీకు దేశమునకు చెందిన వలస జనమునై యుండిరి. క్రీ.పూ. రెండవ

శతాబ్దము ఆరంభంలో అంతియొకు III (మహా అంతియొకు) రెండు వేల మంది యూదా కుటుంబములను లుదియ మరియు ఫ్రుగియ పట్టణముల లోనికి మెసపొతొమియా మరియు బబులోను నుండి దేశాంతర నివాసులుగా తెప్పించాడు.[14] యూదులలో అధిక సంఖ్యాకులు లైకస్ లోయలో నివసించారను మరొక ప్రస్తావనను జే.బి. లైట్‌ఫుట్ తెలియజెప్పాడు, ఈ వివరమును ఆయన యూదులు చెల్లించుచుండిన ఆలయ పన్ను ఆధారంగా చెప్పాడు.[15]

క్రీ.పూ. 133లో, అత్తాలిద్ రాజవంశములోని చివరి పరిపాలకుడైనవాడు తన మరణము తరువాత పెర్గమము సామ్రాజ్యము రోమా ప్రభుత్వ శాసన సభకును రోమా దేశ ప్రజలకును ఇవ్వబడవలెనని తన వీలునామాలో వ్రాసాడు. గనుక అటుతరువాత కొలొస్సీ పట్టణము ఒక రోమా ప్రభుత్వ సామ్రాజ్యముగా పునఃనిర్మింపబడినది. గనుక ఆ తరువాత, ఫ్రుగియ ప్రాంతములో నుండిన ఈ పట్టణము మరియు ఇతర పట్టణములకు రాజకీయపరంగా స్వతంత్ర పరపతి లేకుండినది.

క్రైస్తవ యుగారంభము నాటికి, కొలొస్సీ ఎటువంటి ప్రాముఖ్యతయైనను లేని పట్టణమయ్యింది, లవొదికయ మరియు హియెరాపొలి పట్టణములు దీనిని తలదన్నినంతగా మించిపోయాయి. భూగోళశాస్త్రజ్ఞుడైన స్ట్రాబో, యించుమించుగా క్రీస్తు కాలములో రచించుచు, ఈ పట్టమును “ఒక చిన్న నగరము” అని సంబోధించాడు.[16]

కొలొస్సీ పట్టణము సంస్కృతీపరంగాను మరియు మతసంబంధములోను విభిన్న పద్ధతులు, ప్రవృత్తులు కలిగియుండినది. అది పశ్చిమ మరియు తూర్పు దేశాలకు మధ్య నుండిన ఒక ప్రధాన వాణిజ్య మార్గములో నిలిచియుండినది గనుక, పాశ్చాత్య మరియు ప్రాచ్య సంస్కృతులకు సంబంధించిన తత్వశాస్త్రములకు గురియైనది. ఆసియా మరియు ఫ్రుగియలోని యూదులు (కొలొస్సీ కూడ కలిసియుండును) పెంతెకొస్తు దినాన యెరూషలేములో ఉండిరి (అపొస్తలుల కార్యములు 2:9, 10). కాబట్టి, కొలొస్సీలోని సంఘములో యూదా మతస్థులై ప్రభువునంగీకరించినవారు కూడ ఉండిరని భావించుట క్షేమకరము. కొలొస్సయులకు 2:16లో పౌలు యూదులు అభ్యాసముల గూర్చి సంబోధించుట ఈ అభిప్రాయమును ధృవీకరించుచున్నది.

అనాగరికమైన ఆరాధనా పద్ధతులను అనుసరించువారి దేవతయైన సైబెలికి చేయబడుచుండిన ఆరాధన లైకస్ లోయలో లోతుగా పాతుకుపోయినది, కొలొస్సీ పట్టణములో సహితము అభ్యసింపబడుచుండినదనుటలో ఆశ్చర్యము లేదు. రోమా ప్రభుత్వ పరిపాలనా కాలములోని (క్రీ.పూ. 27–క్రీ.శ. 180)[17] ప్రజలు ఐసిస్, సారప్పిస్, హీలియో, దేమేత్రి, సలీని, ఎఫెస్సు పట్టణ అర్తెమి దేవి, మరియు కిరాతకియైన అర్తెమిదేవి, మొ॥ దేవతలను మరియు స్వదేశీ దేవుడు మేన్‌ను పూజించుచుండినట్లు కొలొస్సీ పట్టణ నాణెములు కనుపర్చుచున్నవి. క్రైస్తవులైనవారిలో అనేకమంది అంతకు మునుపు అన్య మతములకు చెందినవారై యుండినట్లగుపించుచున్నది (కొలొస్సయులకు 1:21). కొలొస్సయులలోని కొందరి నామములు, అన్య మత నేపథ్యము కలిగియుండిన కొందరు క్రైస్తవులయ్యారను అభిప్రాయమునకు ప్రాధాన్యమీయవచ్చును.[18]

ఈనాడు, కొలొస్సీ పట్టణము టర్కీ దేశములో విసర్జింపబడిన ఒక దిబ్బగా మిగిలియున్నది. ఇప్పటి వరకు కూడ, దాని త్రవ్వకములు చేపట్టబడలేదు. ఈ దిబ్బకు వాయవ్య దిశగా యించుమించు మూడు మైళ్ల దూరములో హొనాజ్ అను ఒక గ్రామమున్నది, అది ఎస్కిసెహర్

నుండి డెనిజ్లి వరకు వెళ్లు దారికి కొద్ది దూరములో నున్నది.

## వితండవాద సమస్య

కొలొస్సీ పత్రికలో ఒక బలమైన సందేశము కూడా మిళితమై యున్నది, కానీ కొలొస్సీ సంఘములో ఏ యే సమస్యలు తలెత్తినవో యను విషయము అనిశ్చయముగా నున్నది. ఏమైన నిర్దిష్టమైన పొరపాట్లు సంఘము లోనికి అక్రమంగా ప్రవేశించాయా, లేక మొత్తంమీద ప్రబలుటకు అవకాశములుండిన అబద్ధ బోధలకు వ్యతిరేకముగా పౌలు హెచ్చరించుచుండెనా?

కొలొస్సీ సంఘము అంకిత భావముతో అభివృద్ధిచెందుచుండిన సమూహమై యుండినదను భావమును పౌలు ధ్వనించుచున్నాడు. ఆ సంఘ సభ్యులను ఆయన "పరిశుద్ధులు" మరియు "విశ్వాసులైనవారు" అని సంబోధించుచున్నాడు (1:1, 2). క్రీస్తునందలి వారి విశ్వాసము మరియు పరిశుద్ధులందరి యెడల వారు కలిగియుండిన ప్రేమ గూర్చి సవిస్తరముగా చెప్పుకొనబడుచుండినది (1:3, 4). కొలొస్సీయులు ఫలించుచుండిరి (1:6). వారు రాజ్యనివాసులై యుండిరి (1:13), దేవునితో సమాధానపడినవారై యుండిరి (1:22). వారు బాప్తిస్మము పొంది (2:12) క్రీస్తుతో కూడ సజీవులయ్యారు (2:12-15). వారు క్రీస్తు నందు దాచబడియుండిరి (3:2, 3), వారు ఏర్పరచబడినవారై ప్రేమింపబడిరి (3:12), వారు ఒక్క శరీరమై యుండిరి (3:15). వారు ఎటువంటి అవినీతికైనను పాల్పడినట్లుగాని, సిద్ధాంతపరంగా ప్రక్కకు తొలగుచున్నట్లుగాని పౌలు సూచించలేదు.

ఆ సంఘము యొక్క పరిస్థితిని పౌలుకు తెలియజేయు నిమిత్తము ఎపఫ్రా ఒక సందేశమును తీసికొని వచ్చాడు (1:7, 8). అతడు సంఘ సభ్యుల గూర్చి ఒక మంచి నివేదికను సమర్పించుచుండిన సందర్భములోనే, వారి ఆలోచనా ధోరణిలో గల సమస్యలను సహితము తెలియజెప్పి యుండవచ్చును. అప్పటికి వారు సత్యము నుండి తొలగిపోయి యుండకపోవచ్చును, కానీ వారు పెడదారి పట్టుట నుండి నిరోధించుకొనవలెనని పౌలు కనీసము వారిని హెచ్చరించాడు.

ఈ పత్రికలోని ఒక మూలలో, వారు ఎట్టి పరిస్థితులలోనైనను ఎవ్విధంగానైనను వారికి ప్రకటింపబడిన సువార్త నుండి ప్రక్కకు తొలగకూడదని పౌలు వారిని హెచ్చరించాడు (2:4-23). ఈ హెచ్చరికలు నిర్దిష్టమైన అభ్యాసముల గూర్చి సంబోధించనప్పటికిని, ఇటువంటి సమస్యలను అక్కడ ఎవరో ఒకరు ఉసిగొల్పారని పౌలు సూచించలేదు. వారి సంస్కృతి వారి బలముగా ఆకర్షించునని యెరిగియుండి, వారు క్రీస్తునే హత్తుకొని యుండునట్లు ఆయన వారిని హెచ్చరించుచుండవచ్చును.

(1) *జ్ఞానతత్వ వాదుల బోధలకు సమాధానమిచ్చుటకు పౌలు ఈ పత్రికను వ్రాసియుండవచ్చును.* కొంత కాలము వరకు, పౌలు జ్ఞానతత్వవాదమును గూర్చి చెప్పుచుండినది వితండ వాదమై యుండినదని తలంచబడినది, కానీ అనేక మంది వ్యాఖ్యాన కర్తలు ఈ అభిప్రాయమును విసర్జించారు. జ్ఞానతత్వవాదము రెండవ శతాబ్దము వరకు కూడ సంపూర్తిగా అభివృద్ధికాలేదు. ఈ బోధలోని ప్రధాన దృక్పథములను పీటర్ టూన్ ఇలా వర్ణించాడు:

> నిజమైన దేవుడు నిర్మలమైన ఆత్మయై యుండి స్వచ్ఛమైన వెలుగు పరధిలో నివసించుచున్నాడు, అంధకారమయమైన ఈ లోకములో నుండి సంపూర్తిగా వేరుచేయబడి యున్నాడు. ఈ లోకము చెడ్డది, అది భౌతిక పదార్థముతో చేయబడినది, గనుక అది చెడ్డది. నిజమైన దేవుడు దీనితో ఎటువంటి సంబంధమునైనను కలిగియుండడు, ఏలయనగా అదొక అల్పమైన దేవత చేత సృజింపబడినది గనుక అదొక పొరపాటై ఈ లోకములోని ప్రజలు మామూలుగా శరీరము మరియు మనస్సు కలిగి యున్నారు, కానీ కొద్ది మందిలో నిజమైన ఆత్మ యొక్క ఒక తళుకు ఉన్నది. ఇటువంటి "ఆధ్యాత్మికమైన" వారు ఈ చెడు లోకములో నుండి కాపాడబడవలసినవారై యున్నారు; ఈ విధంగా ఒక రక్షకుని అవసరత అగుపించుచున్నది. ఆయన శరీరము మరియు మనస్సుగలవాడుగా అగపించుచున్నప్పటికిని, పవిత్రమైన ఆత్మయైయున్న యేసు, వెలుగు యొక్క ఆధ్యాత్మిక పరిధి గూర్చిన తెలివినిచ్చుటకై నిజమైన దేవుని నిజమైన వెలుగులో నుండి వచ్చిన రక్షకుడై యున్నాడు. కాబట్టి ఆత్మ యొక్క ఉల్లాస జ్వాల కలిగియున్నవారు తెలివిని పొందుకొని నిజమైన దేవునితో మరల కలిసికొనగలరు.[19]

భౌతిక ప్రపంచము మొత్తానికే చెడ్డదియు, అది ఆత్మ ప్రపంచము నుండి పూర్తిగా వేరైనదై యున్నదనియు జ్ఞానతత్వవాదులు నమ్మెడివారు. తత్ఫలితాంశమైన అభిప్రాయమే, ద్వైత సిద్ధాంతము, అనగా భౌతిక పదార్థము మంచిని మరియు ఆధ్యాత్మికతను వ్యతిరేకించు సూత్రమని ఘోషించు తాత్వికమైన పిడివాదము. ఈ తత్వము ప్రకారము, దేవుడు (సంపూర్ణముగా మంచివాడై యున్నవాడు) భౌతిక పదార్థమును (చెడ్డదైయున్న దానిని) సృజించియుండడు. అల్పమైన ఇతర దేవతలు మిన్నయైన దేవత నుండి అధోముఖ సర్పిలముగా (మెలి) ఉద్భవించారనియు, ఈ దేవతలలో ఒకరు ఈ లోకమును సృజించినదనియు జ్ఞానతత్వవాదులు ప్రతిపాదించినది. ఇతర ఆత్మ రూపుల సహాయ సహకారముతో, ఊహింపబడుచున్నట్లుగా అది మానవ జాతి యొక్క ఆత్మలను భౌతికమైన ఉనికిలో బంధించినది, గనుక ఈ బంధకము నుండి తప్పించుకొని ఆధ్యాత్మిక ఉనికి లోనికి వెళ్లవలెనని మానవులు కోరుచున్నారు. భౌతిక పదార్థ ఉనికి నుండి తప్పించుకొనుటకు అవసరమై యుండిన ఆధ్యాత్మిక జ్వాల ప్రతి ఒక్కరిలో లేదను నమ్మకముండినది. మరణ సమయానికి నిజమైన తెలివి కలిగియుండినవారు మాత్రమే భౌతిక పదార్థ ఉనికిని వదిలిపెట్టి ఆధ్యాత్మిక ఉనికి లోనికి ప్రవేశించిరని చెప్పబడినది.

జ్ఞానతత్వవాదులు యేసు యొక్క శారీరక ఉనికిని, చారిత్రాత్మకమైన ఆయన మరణమును, పాతిపెట్టబడుటను, మరియు పునరుత్థానమును సహితము ఒప్పుకొనలేదు. వారి మనస్సుల్లో, రక్షణ అనంటే అది పాపముల నుండి కలుగు రక్షణ కాదు, కానీ భౌతిక అస్థిత్వము నుండి కలుగు విడుదలయై యున్నది.

(2) *పౌలు బహుశా ప్రాచీన యూదా తెగకు చెందిన ప్రజల (Essenes) బోధనను ప్రస్తావించుచుండెను.* కొలొస్సీ పత్రికపై ఆయన రచించిన మహాకావ్య వ్యాఖ్యానములో, జే. బి. లైట్‌పుట్ ఎస్సెనీయుల (*Essenes*), ప్రాచీన యూదా తెగకు చెందిన ఒక ప్రజా గుంపు, యొక్క బోధనల గూర్చి ఒక అభియోగమును నివేదించాడు. ఏలయనగా అది కొలొస్సీ సంఘము లోనికి అక్రమంగా చొరబడిన ఒక ప్రధాన వితండవాదమై యుండినది.[20] కొలొస్సీయులకును ఎస్సెనీయుల వాదమునకును మధ్య ఒకే విధముగా నున్న విషయాలను సూచించిన తరువాత, డొనాల్డ్ గుథ్రీ ఇలా రచించాడు, "లైట్‌పుట్ రచించిన వాదము

అంగీకరింపబడకపోయినప్పటికిని, ప్రశ్నార్థకముగా నున్న వితండవాదము కంటే, అభివృద్ధి చెందిన రెండవ శతాబ్దము నాటి జ్ఞానతత్వవాదము, ఎస్సెనీయుల బోధనలకు ఎక్కువ దగ్గరగా నున్నదను విషయము కాదనలేని అంశమై యున్నది."[21]

(3) *యేసు గూర్చి చేయబడుచుండిన అబద్ధ బోధనల చేత కొలొస్సయులు వేధింపబడి యుందురు. యేసు స్వభావమును పౌలు నొక్కి వక్కాణించాడు.* ఆయన దేవుని స్వరూపమందు ఉండుట మాత్రమే కాదు గాని (1:15), ఆయన సమస్తమును సృజించిన సృష్టికర్తయై యున్నాడు (1:16, 17). ఆయన అన్ని విషయములలోను ప్రముఖతగలవాడై యున్నాడు. ఆయన సంఘమునకు శిరస్సై యున్నాడు, మరియు సమస్త సంపూర్ణత ఆయనలో ఉన్నది (1:18). ఆయనలో దైవత్వము యొక్క సంపూర్ణత నివసించుచున్నది (2:9).

(4) *క్రైస్తవులలో కొందరు తత్వశాస్త్రము వైపు మళ్లియుండవచ్చును* (2:8). వారికి యేసును గూర్చినది తప్ప ఇతరమైన ఏ బోధయు లేదా యేసు తప్ప ఇతరమైన ఏ బోధకుడైనను అవసరంలేదని చెప్పుచు పౌలు కొలొస్సీయులకు అభయ హస్తమును అందించాడు. యేసులో, క్రైస్తవులు సంపూర్ణులై యున్నారు (2:10).

(5) *యూదా మత ఆలోచనల చేత కొందరు ప్రభావితము చేయబడినవారై యుండవచ్చును.* అలాగైతే, ధర్మశాస్త్రమును పాటించుట ద్వారా క్షమాపణ కలుగునని వారు ఉపదేశించి యుందురు. యేసే వారి పాప(బంధక)ముల నుండి వారిని విడిపించి, ధర్మశాస్త్ర నియమమును కొట్టివేసాడని పౌలు చేసిన ప్రకటన (2:12-16) యూదా మత బోధనలకు ఒక ప్రతిస్పందనయై యుండవచ్చును.

(6) *కొందరు నిర్ణీత యూదా మత బోధకుల ప్రభావమునుబట్టి, కొందరు దేవదూతలను ఆరాధించుచుండినవారై యుండవచ్చును* (2:18). దూతల యెడల ఫ్రుగియ ప్రదేశములోని యూదులు కలిగియుండిన వైఖరి గూర్చి ఎఫ్. ఎఫ్. బ్రూస్ ఇలా చర్చించాడు:

> దేవునికిని మానవునికిని మధ్య సంభవించుచుండిన సమాచార సంభాషణా సరణులను (దేవదూతలు) నియంత్రించుచుండిరి గనుక, దేవుని నుండి మానవునికి వచ్చిన సమస్త బయల్పాటు మరియు దేవుని యొద్దకు చేరిన మానవుల సమస్త ప్రార్థనలు మరియు ఆరాధనలు వారి మధ్య వర్తిత్వము మరియు వారి అనుమతి చొప్పున మాత్రమే వాటి గమ్యాన్ని చేరగలవు. కాబట్టి వారి సౌహార్థమును వృద్ధిపొందించుకొనుచు, వారు కోరిన విధంగానే వారికి అటువంటి గౌరవ ప్రమణాము చేయుట జ్ఞానముతో కూడినదై యుండునని తలంచబడినది.[22]

ఇంతే గాక, మానవునికి ధర్మశాస్త్రము నిచ్చుటకు దేవుడు దూతలను తన ప్రతినిధులుగా వాడుకొన్నాడని వారు ఉపదేశించారు. ఈ హేతువునుబట్టి, ధర్మశాస్త్రమును పాటించుట అనంటే, వారికి మర్యాద కనుపర్చుట యనియు, ధర్మశాస్త్రమును అతిక్రమించుట అనంటే, వారికి అసంతుష్టిని కలుగజేయుటయే ఔతుందనియు అర్థము. ఈ సిద్ధాంతము ప్రకారము, ధర్మశాస్త్రమునకు లోబడుచు తీవ్రముగా శారీరక సంయమనము పాటించుట ద్వారా దూతలు ప్రసన్నం చేయబడవలసినవారై యున్నారు.

(7) *జీవితమును గూర్చిన ప్రాపంచిక దృక్పథమును కొందరు అంగీకరించియుండవచ్చును.* వారి దృక్పథము ఇదే అయియుండినట్లయితే, "లోకసంబంధమైన మూలపాఠములు" అను మాటల్లో పౌలు దీని గూర్చి తెలియజెప్పుచుండెను (2:8).

అన్యమతారాధనల నుండి (లైంగిక సంస్కారాలు కూడ కలుపుకొనబడి యుండినవి) కొందరు బయటికి వచ్చారు. నైతిక ప్రవర్తనమునకు సంబంధించినంత వరకు అన్యమతావలంబికులు కలిగియుండిన తత్వము ఐహికలాభపరాయణముతో పోరాడగల ఎటువంటి గట్టి ప్రమాణములను నివేదించలేదు. 3:3–9లో పౌలు వ్యక్తము చేయుచుండిన తన అందోళనలో ఇదిఒక అంశమై యుండవచ్చును.

(8) *వివిధ మతముల దార్శనిక, పద్ధతుల సమన్వయమునకు సంబంధించిన సమస్య గూర్చి వ్రాసియుండవచ్చును.* అనగా, యూదీయ ఆధ్యాత్మిక చింతన వాదము, తత్వము, మరియు మార్మికమైన అన్యమత విధానములలో గల నానావిధ నమ్మకములను మరియు మతపరమైన బోధనలను ఒక్కచోట కలుపుట. అసలు సమస్య ఇది అని క్లింటన్ ఈ. అర్నాల్డ్ ఒక తుది అభిప్రాయమునకు వచ్చాడు:

> కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక, సంఘము యొక్క ఆరోగ్యమునకు అపొస్తలుడు అపాయకరమైనవాడై యున్నాడని పరిగణింపబడుచున్నాడనియు, క్రీస్తు యొక్క మూర్తిమంతమును కించపర్చుచున్నాడనియు వ్యతిరేకించుచుండిన బోధన యొక్క బెదిరింపు చేత పురికొల్పబడినది. వివిధ మతాలను సమన్వయపర్చు ఈ "తత్వము" కొలొస్సయులకు ఆశ చూపి వంచించునదై యుండినది ఏలయనగా, అధోలోక ఆత్మలు, నక్షత్ర దేవతల యొక్క హానికరమైన ప్రభావమును, మరియు ప్రతి విధమైన అపవిత్రాత్మల శక్తులను నివారించుటకు అది వారికి అదనపు మార్గాలను సమకూర్చినది.[23]

ఒక వేళ అవి ఏమైనా ఉన్నా, కొలొస్సీ సంఘము లోనికి అక్రమంగా వితండవాదములేమై యుండినవో మనకు కచ్చితంగా తెలియకపోయినప్పటికిని, పైన పేర్కొనబడిన సమస్యలతో వ్యవహరించి చక్కదిద్దుటకు సరిపడు బోధను పౌలు వ్రాసిన పత్రిక నివేదించుచున్నది.

## ఉద్దేశము మరియు ప్రధాన చర్చనీయాంశములు

### ఉద్దేశము

పత్రిక యొక్క ఉద్దేశము కొలొస్సీలోని వితండవాదము గూర్చి ఒకరు కలిగియుండు దృష్టికోణముపై ఆధారపడి యుండును. కొలొస్సీ సంఘములో ఒక వితండవాదము తలెత్తినట్లయితే, వారు క్రీస్తునే హత్తుకొని ఆయనయందే విశ్వాసనీయులుగా నిలిచియుండవలెనని వారిని హెచ్చరింపవలెననుది ఈ పత్రికను వ్రాయుటలో పౌలు ఉద్దేశమై యున్నది. ఒక వేళ ఒక వితండవాదము యింకా తలెత్తనట్లయితే, వారు క్రీస్తును విడిచిపెట్టి ప్రక్కకు తొలగకుండవలెనని వారిని హెచ్చరింపవలెననియు, క్రీస్తే అన్నిటి కంటె ఉన్నతమైనవాడై యున్నాడనియు, క్రైస్తవులందరికిని అవసరమైనవాడు ఆయనే అనియు వారికి అభయమియ్యవలెనను తాత్పర్యముతో ఆయన దీనిని రచించాడు.

సంఘములోని ఏ విధమైన అబద్ధ బోధలైనను వారిని క్రీస్తు నుండి వేరుచేసి దూరంచేయకుండా నిరోధించవలెనని పౌలు ఆశించాడు. సంఘము లేత ప్రాయములో ఉండినది. గనుక వారు ఎదుర్కొనుటకు అవకాశములుండిన గండములు గూర్చి సభ్యులను గట్టిగా హెచ్చరించవలసిన అవసరముండినది. వారు క్రీస్తును స్వరక్షకుడైన ప్రభువుగా సంతోషముతో అంగీకరించారు గనుక విశ్వసనీయమైన క్రైస్తవ జీవితము

జీవించు జీవనపథంలో ఉన్నట్లు అగుపించినది; ఏదిఏమైనా, అపాయములు మాత్రం వారి ముందుండినవి. యేసు బోధల కంటే ఎక్కువైన వాటిని వారు అంగీకరింపవలెనని వారికి నచ్చజెప్పుటకు ఎవరైనా ప్రయత్నించవచ్చును. దేవత కంటే యేసు తక్కువైనవాడని చెప్పుటకు సభ్యులు ఆరంభించవచ్చును. భౌతికవాదము, అవినీతి, లేక ఆధ్యాత్మిక లేమి మొ॥ అనుకోకుండా పొంచియుండిన ఇతర అపాయములై యుండినవి.

క్రీస్తు యొక్క ప్రముఖతను నొక్కి వక్కాణింపవలెనని పౌలు ఉద్దేశించాడు. క్రీస్తు బయలుపర్చని ఏ బోధనయైనను అది విధ్వంసకమైనదే. ఆయన సంపూర్ణ దైవత్వమై యున్నాడు గనుక ప్రతి క్రైస్తవుని సమస్త ఆధ్యాత్మిక అవసరములను ఆయన తీర్చగలడు. ఈ హేతువునుబట్టియే, యూదుల మరియు అన్యమతారాధికుల సంస్కృతుల చేతనైనను లేదా వారు తప్పించుకొనిన గ్రీకు తత్వ(శాస్త్ర)ముల చేతనైనను వారు ప్రభావితులు కాకూడదని పౌలు వారిని హెచ్చరించాడు. అవినీతికరమైన లౌకిక అభ్యాసములకు వారు చచ్చినవారును పరలోక విషయములకు వారు సజీవులునై యుండవలెనని ఆయన వారిని ప్రోత్సాహించాడు. వారు పైనున్న వాటి మీదనే లక్ష్యముంచుచు వారి స్వదేశీయ బాధ్యతలను విశ్వసనీయముగా నెరవేర్చవలెనని ఆయన వారిని మందలించాడు.

వారికి ముందు జాగ్రత్తతో కూడిన భద్రతగాను, వారు క్రీస్తును వెంబడించుచు ఇతరమైన ఏ చెడు అలవాటుగాని అభ్యాసముగాను లేకుండు చూచుకొనునట్లు వారిని ప్రోత్సాహించుటకును పత్రిక పంపబడినది. వారు క్రీస్తు యెడల నిజముగా సత్యసంధులుగా నిలిచియుంటూ దైవభక్తిలేని తత్వ(శాస్త్ర)ములకు, సాంప్రదాయములకు, మరియు వారి సంస్కృతికి సంబంధించిన అభ్యాసములకు దూరముగా నుండవలెనని పౌలు వారిని సవాలు చేసాడు.

## ప్రధాన చర్చనీయాంశములుములు

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రిక, అది చిన్నదే అయినప్పటికిని, అందులో బైబిలు యొక్క అనేక ప్రాముఖ్యమైన చర్చనీయాంశములున్నవి. క్రొత్త నిబంధనలో మరోచోట లేని విషయాలు ఇందులో చాలా తక్కువ. సిద్ధాంతములు, నైతిక విలువలు, మరియు కొలొస్సీ సంఘము ఎదుర్కొని తరువాత క్రైస్తవుల తరములను వేధించిన సామాజిక సమస్యలకు సంబంధించిన చర్చలు ఇందులో కుదింపబడి యున్నవి. వీటన్నిటి దృష్ట్యా, ఈ పత్రికలో ఐదు ప్రధాన ఇతివృత్తములు ప్రబలాంశములై యున్నవి:

(1) *పౌలు మరియు సహోదరులు.* ఆయనతో కూడ పయనించిన అనేకులను పౌలు ఈ పత్రికలో పేర్కొన్నాడు: తిమోతి, ఎపఫ్రా, అరిస్తార్కు, మార్కు, బర్నబా, యూస్తు, లూకా, మరియు దేమా (1:1; 4:10–14). యేసును వెంబడించువారి యెడల ఆయన కలిగియుండిన ప్రేమను మరియు ఆయనతో కూడ ఉండినవారి గూర్చి ఆయన కలిగియుండిన ఆందోళన మరియు అనురాగమును బాహాటంగా బయలుపర్చాడు.

పౌలు ఆయనకు తెలిసిన వారి విషయములో మాత్రమే ఆసక్తిపరుడై యుండలేదు, కానీ ఆయన ఎన్నడును చూడని తోటి క్రైస్తవులు గూర్చి కూడా అది ఆయన కర్తవ్యమై యుండినదని కూడ భావించాడు. ఆయన కొలొస్సయుల కొరకు ప్రార్థించుట కొనసాగించాడు గనుక వారిలో ఆధ్యాత్మిక ఎదుగుదలను మరియు క్రీస్తు యెడల చిత్తశుద్ధిగల భక్తిని

అభివృద్ధి చేయుటకు ప్రయత్నించాడు (1:1-14). ఆయన పరిపూర్ణుడై ఆ తరువాత సమస్త విశ్వాసులను స్థిరపర్చగలడనియు, నశించిన వారితో యేసు క్రీస్తునందు గల దేవుని ఆశీర్వాదముల మర్మములను పంచుకొనగలడనియు ఆయనకుండిన నిరీక్షణనుబట్టి ఆయన అనేక బెడదలను భరించాడు (1:24-29).

(2) *హెచ్చింపబడిన క్రీస్తు.* పౌలు ప్రకారము, యథార్థమైన బోధనలన్నిటికిని గల మూలాధారము, యేసు యొక్క గొప్పతనము మరియు అధికారమే. ఆయన దేవుని స్వరూపము ధరించియున్నాడు, సృష్టికర్తయై యున్నాడు, ఆయనే సమస్తమును పరిపాలించుచున్నాడు, సంఘమునకు శిరస్సై యున్నాడు (1:15-18). సిలువ మీద చిందింపబడిన ఆయన రక్తము ద్వారా, దేవునితో సమాధానమును సాధ్యము చేసాడు (1:19-23). నిజమైన సమస్త జ్ఞానము మరియు తెలివి (2:3) మరియు దైవత్వము యొక్క సర్వసంపూర్ణత క్రీస్తునందు కలదు (2:9, 10).

కొలొస్సయులు మానవ జ్ఞానము మరియు బోధనల వైపు మళ్ల కూడదని వారిని హెచ్చరించగలుగునట్లు పౌలు యేసును గూర్చిన ఈ సత్యములను ప్రకటించాడు. వారు యేసు యెడల విశ్వసనీయులుగా నిలిచియుండవలెను, ఆయననే హత్తుకొనవలెను, మానవ తత్వములను మరియు నియమములను లేక మర్మపూరితమైన మతము యొక్క అభ్యాసములను అనుసరించుట వలన వారి బహుమానము అపహరింపబడకూడదు (2:4-8, 18-23). సరికదా, ధర్మశాస్త్రము వారి జీవితములకు నిర్దేశకుడై యండకూడదు. ఏలయనగా యేసు దానిని సిలువకు కొట్టివేసాడు (2:13-17).

(3) *క్రీస్తునందు నూతనసత్వం.* క్రీస్తు సమస్తమునకు చాలినవాడై యున్నందు వలన, వారి పాపములు క్షమింపబడునట్లు వారు బాప్తిస్మములో క్రీస్తుతో కూడ పాతిపెట్టబడి లేపబడుట ద్వారా కొలొస్సయులు ఆయన యందు నూతనపరచబడి యున్నారు (2:11, 12). క్రీస్తుతో కూడ వారు కలుగజేసుకొని కలిగియున్న సంబంధమును బట్టి వారి జీవితమునే మార్చివేయు పర్యవసానము వారిలో కనబడును. వారు క్రీస్తుతో కూడ మృతి చెంది యున్నారు (2:20-22) మరియు ఆయనతో కూడ లేపబడియున్నారు (3:1-3). ఈ కారణమును బట్టి, జీవితములో వారు కలిగియున్న సమీపమార్గం మరియు ఉద్దేశము మారవలసినవై యున్నవి. వారి జీవితము మరియు జీవన విధానము వ్యత్యాసమైనదై యుండవలెను. అవినీతికరమైన అభ్యాసములను ఆపుజేసి దైవభక్తిలేని గుణగణములపై గెలుపొందవలెను (3:5-9). వారు యేసు క్రీస్తులో గల సద్గుణములను అభివృద్ధి చేసికొనవలెను (3:10-14). అప్పుడు దాని పరిణామము ఒక్క శరీరమందలి ఐక్యతయై యుండును (3:15).

క్రీస్తునందు గొప్ప దీవెనలు పొందుకొనిన తరువాత, హృదయాంతరాళములో నుండి ఉప్పొంగి వచ్చు పాటల ద్వారా కొలొస్సయులు దేవుని స్తుతించుదురు (3:16). వారు - వారి మాటల్లో మాత్రమే కాదు, కానీ వారి క్రియలలో సహితము క్రీస్తుకు ప్రియమైనవారై యుండవలెను (3:17).

(4) *కుటుంబ సంబంధమైన విచారణ.* వారు ఇతరులతో కలిగియుండు సంబంధములు యేసు సూత్రములను ఆధారముచేసికొని అనుసరింపబడుచున్నవై యుండవలెను. కుటుంబములో భర్తలు నాయకులై యుండవలెను, భార్యలు వారి భర్తలతో సహకరించవలెను, వారి పిల్లలు వారి తలిదండ్రులకు విధేయతతో లోబడవలెను, దాసులు వారి యజమానులకు

లోబడవలెను, యజమానులు వారి బానిసల యెడల న్యాయముగాను సముచితముగాను వ్యవహరించవలెను (3:18–4:1).

(5) *క్రీస్తునందలి క్షమాపణ.* పౌలు పాప క్షమాపణను 1:14లో పరిచయము చేసి ఆ క్షమాపణ పొందుటను గూర్చి 2:11–15లో చర్చించాడు. ప్రేరేపింపబడిన ఇద్దరు గ్రంథకర్తల పేర్లు ఆయన పేర్కొన్నాడు, మార్కు మరియు లూకా (4:10, 14), వీరిద్దరు సువార్తలను రచించారు. ఈ గొప్ప చర్చనీయాంశమునకు సంబంధించి యేసు మరియు ఆది సంఘము చేసిన బోధలు వారి రచనలలో కలవు.

కొలొస్సీ పత్రికను జాగ్రత్తగా అధ్యయనము చేయుట ద్వారా, క్రైస్తవులకు యేసును గూర్చి లోతైన అవగాహన కలుగుతుంది గనుక వారు ఆయనను వెంబడించుటకు ప్రోత్సాహింపబడుదురు. ఇహమందు మన జీవితములు ఆనందమయమును ప్రయోజనకరమునై యుండునట్లును, పరలోకమందు ఆయనతో కూడా జీవించునట్లును యేసు ఏమైయున్నాడో మరియు ఆయన ఏమేమి బృహత్కార్యములు చేసాడో అను వాస్తవమునుబట్టి మనము ఆయనను గౌరవించవలెను.

## సంక్షిప్త వర్ణన

I. వందనములు (1:1, 2)
   A. పౌలు మరియు తిమోతి యొక్క వందనములు (1:1)
   B. విశ్వాసులైన కొలొస్సీ సహోదరులకు (1:2)

II. కొలొస్సయులను బట్టి పౌలు దేవునికి కృతజ్ఞత వందనములు తెలియజేసికొనుట (1:3–8)
   A. కృతజ్ఞతా ప్రార్థన (1:3)
   B. వారి విశ్వాసము మరియు ప్రేమ (1:4)
   C. వారి పరలోకపు నిరీక్షణ (1:5)
   D. వారి విశ్వాసపు ఫలితాలు (1:6)
   E. ఎఫఫ్రా యొక్క నివేదిక (1:7, 8)

III. కొలొస్సయుల కొరకు పౌలు ప్రార్థన (1:9–14)
   A. వారి జ్ఞానము మరియు ఆత్మ సంబంధమైన వివేకము (1:9)
   B. వారి క్రైస్తవ నడక మరియు ఫలించుట (1:10)
   C. వారి ఆత్మీయ బలం (1:11, 12)
   D. వెలుగు రాజ్యములోనికి వారి ప్రవేశం (1:12బి, 13)
   E. క్రీస్తేసు నందు వారి మన పాపక్షమాపణ (1:14)

IV. క్రీస్తు గొప్పతనము యొక్క వర్ణన (1:15–20)
   A. అదృశ్య దేవుని స్వరూపము మరియు సమస్త సృష్టికి ఆదిసంభూతుడు (1:15)
   B. సమస్తమును సృష్టించినవాడు (1:16)

C. సమస్తమునకు ఆధారభూతుడైనవాడు (1:17)
D. సంఘమునకు శిరస్సు మరియు సర్వోన్నతుడు (1:18, 19)
   1. సంఘమునకు శిరస్సు (1:18)
   2. సృష్టికి మూలాధారుడు (1:18)
   3. మృతులలో నుండి లేచిన ఆదిసంభూతుడు (1:18)
   4. అన్నిటిలోను ప్రముఖమైనవాడు (1:18)
   5. సమస్త సంపూర్ణత ఆయనలోనే ఉన్నది (1:19)
E. సమాధానమునకు మూలాధారము (1:20)

V. క్రీస్తు ద్వారా కలుగు సమాధానము గూర్చి పౌలు అభయమిచ్చు చున్నాడు (1:21–23)
A. వాటి తొల్లిటి స్థితి (1:21)
B. క్రీస్తు మరణము ద్వారా వారు సమాధానపడుట (1:22)
C. వారు విశ్వసించవలెను (1:23)

VI. కొలొస్సయుల కొరకు పౌలు పడిన ప్రయాసము (1:24–29)
A. ఆయన ఆనందము: వారి కొరకు శ్రమనొందుట (1:24)
B. వారికి బయలుపరచబడిన మర్మము (1:25–27)
C. వారి గూర్చిన ఆయన లక్ష్యము: క్రీస్తునందలి సంపూర్ణత (1:28, 29)

VII. పౌలు నివేదన: జ్ఞానమునకును తెలివికిని మూలము, క్రీస్తే (2:1–7)
A. ఆయన కోరిక: దేవుని మర్మములను వారు సంపూర్ణముగా గ్రహించవలెను (2:1, 2)
B. ఆయన బయల్పాటు: సమస్త జ్ఞానము మరియు తెలివి క్రీస్తునందే యున్నది (2:3, 4)
C. ఆయన సంతోషము: క్రీస్తునందలి వారి విశ్వాసం (2:5)
D. ఆయన మందలింపు: క్రీస్తును స్వీకరించిన రీతిగానే వారు ఆయనలో నడుచుకొనవలెను (2:6)
E. ఆయన ప్రోత్సాహము: క్రీస్తునందు బలముగా కట్టబడుట (2:7)

VIII. పౌలు క్రీస్తు సంపూర్ణతను చిత్రీకరించుచున్నాడు (2:8–15)
A. మానవ కల్పిత బోధల చేత చెరపట్టబడకూడదని ముందుగానే హెచ్చరించుట (2:8)
B. దైవత్వము క్రీస్తునందు నివసించుచున్నది (2:9)
C. క్రీస్తునందలి సంపూర్ణత (2:10, 11)
D. క్రీస్తునందలి జీవితము మరియు క్షమాపణ (2:12, 13)
E. ధర్మశాస్త్ర సంబంధ నియమముల నుండి క్రీస్తులో గల స్వేచ్ఛ (2:14)

F. వ్యతిరేకతను క్రీస్తు బయటపెట్టుచున్నాడు (2:15)

IX. శిరస్సునే హత్తుకొని యుండవలెనని పౌలు మందలించుచున్నాడు (2:16–23)
   A. ధర్మశాస్త్రమును అనుకరించుటకు బదులుగా క్రీస్తును వెంబడించుము (2:16, 17)
   B. మానవ కల్పిత అభ్యాసములకు దూరముగా ఉండుము (2:18, 19)
   C. లోక నియమముల కొరకు క్రీస్తుతో మరణించుట (2:20–23)

X. క్రీస్తునందలి నూతన జీవము నిర్వచింపబడినది (3:1–14)
   A. పైనున్నవాటినే వెదకుట (3:1–4)
   B. అనైతిక గతమును చంపివేయుట (3:5–7)
   C. దైవ భయము భక్తి లేని స్వభావమును విసర్జించుట (3:8, 9)
   D. క్రీస్తు స్వరూపము లోనికి నవీకరింపబడుట (3:10, 11)
   E. దైవభక్తి గల లక్షణములను ధరించుట (3:12–14)

XI. క్రీస్తు యెడల ప్రతిస్పందన (3:15–17)
   A. ఆయన సమాధానమును పొందునుట (3:15)
   B. పాటలు పాడుచు ఆయనను ఆరాధించుట (3:16)
   C. సమస్తమును ఆయన పేరట చేయుట (3:17)

XII. సంబంధములకు సంబంధించిన బాధ్యతలు (3:18–4:1)
   A. భార్యలు, భర్తల యెడల (3:18)
   B. భర్తలు, భార్యల యెడల (3:19)
   C. పిల్లల, తలిదండ్రుల యెడల (3:20)
   D. తండ్రులు, పిల్లల యెడల (3:21)
   E. బానిసలు, యజమానుల యెడల (3:22–25)
   F. యజమానులు, బానిసల యెడల (4:1)

XIII. అంతిమ వచనములు (4:2–18)
   A. మందలింపులు (4:2–6)
      1. ప్రార్థించుము, ప్రత్యేకముగా పౌలు కొరకు (4:2–4)
      2. పరదేశుల యెడల వివేకముతో ప్రవర్తించుట (4:5, 6)
   B. ఆదేశములు మరియు ప్రశంసలు (4:7–9)
      1. తుకికును గూర్చి (4:7, 8)
      2. ఒనేసిమును గూర్చి (4:9)
   C. వందనములు మరియు విశేషాంశములు (4:10–18)
      1. తోటి పనివారు పంపుచున్న వందనములు (4:10–14)

        a. యూదీయ క్రైస్తవులు (4:10, 11)
        b. అన్య క్రైస్తవులు (4:12-14)
    2. సహోదరులకు వందనములు మరియు సహోదరుల గూర్చిన వ్యాఖ్యానములు (4:15-17)
        a. లవొదికయ సంఘస్థులకు మరియు నుంఫాకు (4:15)
        b. పౌలు వ్రాసిన ఉత్తరములను చదువుట గూర్చి (4:16)
        c. అర్ఖిప్పుకు (4:17)
    3. ముగింపు మాటలు (4:18)

---

సూచనలు

[1]Ernst Theodor Mayerhoff, *Der Brief an die Kolosser, mit vornehmlicher Berücksichtigung der drei Pastoralbriefe, kritisch geprüft* (Berlin: Hermann Schultze, 1838). [2]Henry Clarence Thiessen, *Introduction to the New Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1943), 229-30. [3]Donald Guthrie, *New Testament Introduction,* 3d ed., rev. (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1970), 554. [4]Robert G. Bratcher మరియు Eugene A. Nida కొలొస్సీ మరియు ఎఫెస్సీ పత్రికల మధ్య గల సంబంధము గూర్చి చర్చించారు: "కొలొస్సీ పత్రిక ఏదో ఒక విధంగా ఎఫెస్సీ పత్రికతో సంబంధము కలిగియున్నది. విదితముగా గోచరమగుచున్న రెండు పత్రికల ప్రధానాంశములలో గల పోలికలే గాక, పౌలు చెరసాలలో ఉన్నాడు [ఎఫెసీయులకు 6:20] మరియు పౌలు ఎలా ఉన్నాడో పాఠకులకు తెలియజెప్పవలెనను ఆదేశములివ్వబడి, పత్రికతో కూడ తుకికు పంపబడుచున్నాడు [ఎఫెసీయులకు 6:21, 22]" (Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon,* Helps for Translators [New York: United Bible Societies, 1977], 1). [5]ఈ సమాంతరముల గూర్చిన అధికమైన అధ్యయనము నిమిత్తము H. C. G. Moule, *The Epistles to the Colossians and to Philemon,* The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University Press, 1893; reprint, 1902), 47-49 చూడుము. [6]Curtis Vaughan, *Colossians and Philemon,* Bible Study Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1980), 15. [7]Chrysostom *Colossians* 1. See also Everett Ferguson, *Early Christians Speak* (Abilene, Tex.: Biblical Research Press, 1981), 244; and Ralph P. Martin, *Colossians and Philemon,* New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1973), 217. [8]ఈ తేదీల గూర్చిన అధిక అధ్యయనము నిమిత్తము Colin J. Hemer, *The Book of Acts in the Setting of Hellenistic History,* ed. Conrad H. Gempf (Winona Lake, Ind.: Eisenbrauns, 1990), 169-71 చూడుము. [9]Pliny *Natural History* 21.51. [10]Tacitus *Annals* 14.27.

[11]E. J. Banks, "Colossae," in *The International Standard Bible Encyclopedia,* rev., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:732. [12]Xenophon *Anabasis* 1.2.6. [13]Herodotus *Histories* 7.30. [14]Josephus *Antiquities of the Jews* 12.3.4. [15]J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon,* rev. (London: Macmillan & Co., 1916), 20 చూడుము. [16]Strabo *Geography* 12.8.13. [17]రోమా సామ్రాజ్యము క్రీ.పూ. జనవరి 16, 27లో లాంఛనప్రాయంగా ప్రారంభించబడినది. S. Angus and A. M. Renwick, "Roman Empire," in *The International Standard Bible Encylopedia,* rev., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:208 చూడుము. [18]"కొలొస్సీ పత్రికలో పేర్కొనబడిన కనీసము ముగ్గురు క్రైస్తవుల నామములు పరోక్షముగా అన్యమతారాధికుల దేవతలతో ముడిపెట్టబడి చెప్పబడుచున్నవి: తుకికు (గ్రీకు Gk. *Tuche* = గ్రహపాటు). ఎపఫ్రా (ఎపఫ్రాదితునకు లఘు నామధేయము, ఆఫ్రాదితునకు సంబంధించినది), మరియు నుంఫా (... నుంఫాడోర నుండి వచ్చినది, 'నుంఫా ఇచ్చిన వరము')" (David M. Hay, *Colossians,* Abingdon New Testament Commentaries [Nashville: Abingdon Press, 2000], 25). [19]Peter Toon, "Gnosticism," in *The New Inter-*

*national Dictionary of the Bible,* ed. Merrill C. Tenney, rev. J. D. Douglas (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1987), 393. [20]Lightfoot, 71-111. మృత సముద్ర వ్రాత ప్రతుల చుట్టల ఆధారంగా ప్రాచీన యూదా తెగకు చెందిన ప్రజలైన ఎస్సెనీయుల వాదమునకు సంబంధించినంత వరకు లైట్‌ఫుట్ తన వాదనను వినిపించలేదు, ఏలయనగా ఆయన తన రచనను ఇవి కనుగొనబడక మునుపే ముగించాడు.

[21]Guthrie, 550. [22]E. K. Simpson and F. F. Bruce, *Commentary on the Epistles to the Ephesians and the Colossians,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 167. [23]Clinton E. Arnold, *The Colossian Syncretism* (Grand Rapids, Mich.: Baker Books, 1996), 308.

## కొలొస్సీ, ఎఫెస్సీ మరియు గలతీయ పత్రికలలో గల ఒకే విధమైన ఉపదేశములు

| | కొలస్సీ | ఎఫెస్సీ | గలతీ |
|---|---|---|---|
| 1. క్రైస్తవులకు అంతరంగములో అవసరమైన బలము | 1:11 | 3:16 | |
| 2. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు | 1:18; 2:19 | 1:22, 23<br>4:15; 5:23 | |
| 3. క్రీస్తు యొక్క ప్రాముఖ్యత | 1:18 | 1:20–22 | |
| 4. క్రీస్తు యొక్క సంపూర్ణత | 1:19; 2:9 | 1:23; 3:19 | |
| 5. క్రీస్తు ద్వారా క్రైస్తవుల పరిశుద్ధత | 1:21, 22 | 5:25–27 | |
| 6. గతించిన యుగముల మర్మము: అన్యజనులు కలుపుకొనబడి యున్నారు | 1:26, 27;<br>2:2; 4:3 | 1:9; 3:3–9;<br>6:19 | |
| 7. బాప్తిస్మము పొందుకొన్నవారు, విశ్వాసము ద్వారా శుద్ధీకరింపబడుదురు | 2:12, 13 | 5:26 | 3:26, 27 |
| 8. క్రీస్తునందలి నూతన జీవితము | 2:13; 3:1 | 2:5, 6 | |
| 9. ధర్మశాస్త్రనియమము నిర్మూలింపబడినది | 2:14 | 2:14, 15 | 3:24, 25 |
| 10. మతపరమైన ప్రత్యేక దినములు యిక పాటించనవసరములేదు | 2:16 | 4:10 | |
| 11. క్రైస్తవులు క్రీస్తును హత్తుకొనియుండి, అబద్ధ బోధలకు బానిసలు కాకూడదు | 2:18–20 | 4:13–15 | |
| 12. శిరస్సు సహాయముతో శరీరమును బలపర్చుట | 2:19 | 4:16 | |
| 13. గతించిన చెడును విసర్జించి నూతన జీవమును ధరించుట | 3:8–14 | 4:22–26 | |
| 14. క్రైస్తవులు ఒక్క శరీరముగా పనులు నిర్వహించుట | 3:15 | 2:16; 4:4 | |
| 15. పాటలు పాడుట గూర్చిన ఆదేశములు | 3:16 | 5:19 | |
| 16. భార్యాభర్తలకు, పిల్లలకు, యజమానులకు, మరియు దాసులకు ఇవ్వబడిన ఆదేశములు | 3:18–4:1 | 5:23–6:9 | |